క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్న దానానికి మంగళవారం తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన పద్మనాభం, ప్రణీత్ రూ.1,00,116లు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. వారికి స్వామి వారికి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


చెంగనపల్లెలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్

ఐరాల: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే తమ లక్ష్యమని పైపల్లె డీఈఈ సుబ్రమణ్యం అన్నారు. రెండు రోజుల క్రితం మండలంలోని చెంగనపల్లెలో హైఓల్టేజీ కారణంగా గృహ సర్వీసుల ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో పాటు ఇళ్లల్లో టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్‌మెషిన్లు, ల్యాప్‌టాప్‌లు కాలిపోవడం విదితమే. దీనిపై గ్రామస్తులు ఆగ్రహించి ఆందోళన కూడా చేశారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. పైపల్లె డీఈఈ నేతృత్వంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి గృహాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఎలక్ట్రానిక్ విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలు


చైతన్యను శాలువతో సత్కరిస్తున్న అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్: ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్ చదివే విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలున్నట్లు మెయింటెనెన్స్ ప్రాజెక్ట్స్ మేనేజర్ చైతన్య అన్నారు. మంగళవారం ఆర్‌వీఎస్ నగర్‌లోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా చైతన్య మాట్లాడారు. ఎలక్ట్రికల్ వెహికల్ ఇండస్ట్రీలో సెమి కండక్టర్ విభాగాల్లో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్‌బాబు మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో సులువుగా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అనంతరం చైతన్యను సత్కరించారు. ఎలక్ట్రికల్ విభాగాధిపతి విజయకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ


సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

గుడిపాల: మండలంలోని రేషన్ షాపులను ఆర్డీఓ చిన్నయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బసవాపల్లె రేషన్‌షాపులో బియ్యం సక్రమంగా లబ్ధిదారులకు వేస్తున్నారా, లేదా? అని పరిశీలించారు. అక్కడ ఎండీయూ ఆపరేటర్లతో మాట్లాడారు. సకాలంలో లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందజేయాలన్నారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి బియ్యం, చక్కెర మాత్రమే ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మండలంలో 40శాతం వరకు బియ్యం పంపిణీ పూర్తయ్యిందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ రమ, వీఆర్‌ఓ రమేష్ పాల్గొన్నారు.

ఈరోజు

హుండీ ఆదాయం లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో బుధవారం హుండీల ఆదాయం లెక్కించనున్నట్టు ఆలయ ఈఓ గురుప్రసాద్ తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆస్థాన మండపంలో నిర్వహించే కార్యక్రమానికి ఆలయాధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరారు.

కాణిపాక బ్రహ్మోత్సవాలపై సమీక్ష

చిత్తూరు కార్పొరేషన్: కాణిపాక బ్రహ్మోత్సవాలలో ట్రాన్స్‌కో శాఖ చేయవలసిన పనులపై బుధవారం ఉదయం 9.30 గంటలకు ట్రాన్స్‌కో చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నట్టు ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ అధికారులతో చర్చించనున్నట్లు చెప్పారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. పుంగనూరు నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అవడం విదితమే.

మాతృశాఖకు అరుణ

చిత్తూరులో పనిచేస్తున్న అరుణను ఆమె మాతృశాఖ (పంచాయతీ రాజ్)లో రిపోర్టు చేయమని ఆదేశాలు వచ్చాయి.

‘పరి వాహన్’.. పరేషాన్..!

దాదాపు 4 వారాలుగా 'పరి వాహన్' పోర్టల్ ముప్పుతిప్పలు పెడుతోంది. రవాణా శాఖ సేవలకు మొరాయిస్తోంది. ఈపోర్టల్ మార్పుతో వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్సులు, లైసెన్సుల రెన్యువల్, తదితర అవసరాలకు మీ–సేవా కేంద్రాలు, రవాణా శాఖ కార్యాలయాలకు వెళ్తున్న వారికి నిరాశే ఎదురవుతోంది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గడువు ముంచుకొస్తోందని..మళ్లీ దరఖాస్తులు ఎలా? అంటూ పలువురు మండిపడుతున్నారు.

కాణిపాకం: ఇతర జిల్లాల వాహనాలను జిల్లా పరిధిలోకి చిరునామా మార్చుకోవాలన్నా ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ–ప్రగతి పోర్టల్‌లో సేవలు అందిస్తుండగా, ఆ వివరాలు పరివాహన్‌లోకి మారడం లేదు. పరి వాహన్, సారథి పోర్టళ్లు తరచూ మొరాయిస్తూ చుక్కలు చూపిస్తున్నాయి. డ్రైవింగ్ లైసెన్సులు, ఎల్‌ఎల్‌ఆర్‌ల జారీ, వాహనాల బదిలీ, రెన్యూవల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఎన్‌వోసీల జారీ, త్రైమాసిక పన్నుల చెల్లింపు ఇత్యాది సేవలు అందేవి. జిల్లాలో ఈ సేవల కోసం నిత్యం వందల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తుంటారు. రోజూ 800 మందికి పైగా పలు సేవలు వినియోగిస్తుంటారు. వీటిలో ప్రధానమైనవి ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్సులు. ఈ రెండు సేవలే రోజుకు 300 నుంచి 400 వరకు ఉంటాయి. మిగిలినవి ఇతర సేవల కోసం ఉంటున్నాయి. అయితే తరచూ కేంద్ర సర్వర్ మొరాయిస్తోంది.

వారాలు తరబడి ఇబ్బందులు

ఈ పోర్టల్ ద్వారా అన్ని రకాల సేవలను రవాణా శాఖ అందిస్తోంది. దీంతో గత పాత డేటా సకాలంలో బదిలీ కాక దరఖాస్తుదారులకు రోజుల పాటు నిరీక్షణ తప్పడం లేదు. ఒక్కో పని కోసం ఎక్కువ రోజులు తిరగాల్సి వస్తోంది. గత 21 రోజుల నుంచి సర్వర్ సమస్యలు ఎక్కువయ్యాయి. వివరాలు నమోదు చేసే లోపే ఆగిపోతోంది. అన్ని రాష్ట్రాల్లో ఒకే వ్యవస్థ ఉండాలనే ఉద్దేశంతో 'పరివాహన్' పోర్టల్ తెచ్చారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ఈ–ప్రగతితోపాటు పరివాహన్‌నూ అమలు చేస్తున్నారు. కేంద్ర పోర్టళ్లలో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. 'పరివాహన్' రాక ముందు ఈ–ప్రగతి నుంచి జరిగిన సేవల సమాచారాన్ని ఎన్ఐసీ సర్వర్‌లోకి బదిలీ చేస్తుండగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహన్ వెబ్‌సైట్‌లో నెమ్మదిస్తుండడంతో డేటా మొత్తం ఎన్ఐసీలోకి చేరడంలో ఆలస్యమవుతోంది.



పరివాహన్ యాప్

త్వరలో పరిష్కారం

పరివాహన్ సర్వర్‌లో సమస్యలు వస్తున్నాయి. దీని కారణంగా కొన్ని సేవలను ఈ ప్రగతి ద్వారా చేస్తున్నాం. పరివాహన్‌లో చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆందోళన చెందనవసరం లేదు. త్వరలో పరిష్కారమవుతుంది.

–నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

సాంకేతిక సమస్యలతో జాప్యం..స్లాట్ మార్పు

ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్సుల పరీక్షలకు కూడా సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. దరఖాస్తుదారులు వారికి ఇచ్చిన సమయానికి కార్యాలయాలకు వెళ్తే మరో రోజు రావాలని స్లాట్ సమయాలు మారుస్తున్నారు. సారథి పోర్టల్‌లో ఇబ్బందుల మూలానే ఇలా అవుతోంది. దీని కన్నా వాహన్ సేవల్లో ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. ఒక వాహనాన్ని బదిలీ చేయాలన్నా.. పాత డేటా రావడం లేదు. 'పరివాహన్' వివరాలు కనిపిస్తున్నా.. బీమా, పొల్యూషన్, పన్నులు, పర్మిట్, ఫిట్‌నెస్ వివరాలు కనిపించక లావాదేవీ ఆగిపోతోంది. ఈ–ప్రగతి సేవలు అందించే ఏజెన్సీతో ఒప్పందం ముగియడంతో ఆ సర్వర్‌లో డేటా సకాలంలో పొందాలన్నా కష్టమవుతోంది. అందులో రికార్డులు తీసుకుని, ఢిల్లీలో ఎన్ఐసీకి పంపి.. తిరిగి వాటిని 'పరివాహన్'లోకి మార్చాల్సి వస్తోంది. ఫలితంగా సమయం వృథా అవుతుండడమే కాకుండా ఆధార్ సర్వర్ సమస్యలూ తోడై కష్టాలు రెట్టింపవుతున్నాయి.

విధిగా రక్త, గల్ల పరీక్షలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): క్షయ వ్యాధుల నిర్ధారణ పరీక్ష విషయంలో ల్యాబ్ సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అనుమానితులకు రక్త, గల్ల పరీక్షలు చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ల్యాబ్ టెక్నీషియన్లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ల్యాబ్ సిబ్బంది ఓపీకి వచ్చే వారిలో 10 శాతం మందికి గల్ల పరీక్షలు చేయాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే కచ్చితంగా గల్ల పరీక్ష చేసి రిపోర్టు ఇవ్వాలన్నారు. పాజిటివ్‌గా గుర్తిస్తే వారికి మెరుగైన వైద్యం అందించి క్రమం తప్పకుండా మాత్రలు పంపిణీ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని, తీవ్ర జ్వరంతో ఎవరైనా బాధపడుతున్న పక్షంలో మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, వైద్యశాలల్లో వైద్యసేవలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంఓ అనిల్‌కుమార్, అధికారులు రామచంద్రారెడ్డి, శివ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్

గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన

బంగారుపాళెం: గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ ఆదేశించారు. మంగళవారం తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఆశాలు క్షేత్ర స్థాయిలో నిర్వహించే ఇంటింటా సర్వేలో గర్భవతుల ఆరోగ్యం, వారికి అందించాల్సిన వైద్య సేవలపై ఆయన అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, డెంగీ మలేరియాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల సకాలంలో వేయాలన్నారు. ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్షేత్ర స్థాయిలోనే ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రమేష్‌బాబు, డీపీఎం మణి, హెల్త్ సూపర్‌వైజర్లు హరికృష్ణ, అముద, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


హాజరైన ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

తవణంపల్లె: ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ రమేష్‌రెడ్డి ఆదేశించారు. పక్కా గృహాల నిర్మాణంపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమీక్షించారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను డిసెంబర్ లోపు పూర్తి చేయించాలన్నారు. లబ్ధిదారులను చైతన్య పరచి పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. వివిధ దశలలో జరుగుతున్న పనులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఈఓపీఆర్డీ కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ రమేష్‌రెడ్డి

గుడిపాలలో ‘ఫ్యామిలీ డాక్టర్’

గుడిపాల: మండల కేంద్రంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, సింధుజ, సోనియా పాల్గొన్నారు.

కె.పట్నంలో..

తవణంపల్లె: గర్భవతులు రక్తహీనత బారిన పడకుండా తగు జాగ్రత్తలు వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌వేలు అన్నారు. మండలంలోని కె.పట్నంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయడంతోపాటు గర్భవతులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. నెలలు నిండిన తర్వాత ఆస్పత్రిలో కాన్పులు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

చెర్లోపల్లెలో..

అలాగే చెర్లోపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం ఇళ్లకే పరిమితమైన రోగుల చెంతకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


కె.పట్నంలో గర్భవతులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు


వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

వరద బాధితులకు నెల జీతం విరాళం ఇవ్వండి

– సీఎం, మంత్రులకు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ సూచన

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఒక నెల జీత భత్యాలను విరాళంగా ప్రకటించి, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అలాగే టీటీడీ, శ్రీకాళహస్తి దేవస్థానం సైతం చెరో రూ.5కోట్లు ఇవ్వాలని, టీటీడీ ఆధ్వర్యంలో విజయవాడ, గుంటూరు, ఎన్టీఆర్, వరద ప్రభావిత జిల్లాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే టీటీడీ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు ఒక రోజు జీతం వరద బాధితులకు సాయంగా ఇవ్వాలని ఆయన కోరారు.

రైతుల సహకారంతో విద్యుత్ పనులు

చిత్తూరు కార్పొరేషన్: గ్రామాల్లో విద్యుత్ పనులకు రైతుల సహకారం అవసరమని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర కోరారు. డివిజన్ పరిధిలోని 11 సబ్‌స్టేషన్లలో మంగళవారం రైతులకు సమావేశాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వ్యవసాయ సర్వీసులకు కరెంటు స్తంభాలు అవసరమని, పాడైన కేబుల్స్‌ను మార్పు చేయాలని రైతులు కోరారు. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడానికి, లైన్ల మార్పులకు గ్రామస్తులు సహకారం ఇవ్వాలని ఈఈ కోరారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలు ఉంటే డివిజన్ కార్యాలయంలో అధికారుల దృష్టికి తేవాలన్నారు. ప్రతి ఫీడర్ వారీగా సర్వే చేస్తున్నామని, ఎక్కడెక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు అవసరమో గుర్తించి, ఆ పనుల కోసం అనుమతులు పొంది, దశల వారీగా పూర్తి చేస్తామన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ఐరాల: హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వాతి సింధూర అన్నారు. మంగళవారం కాణిపాకం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కోర్ ఎన్‌జీఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ, సురక్షితం కాని లైంగిక సంబంధాలు, వ్యాధిగ్రస్తుల రక్తాన్ని మరొకరికి ఎక్కించడం వలన ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. వ్యాధిగ్రస్తులతో తిరిగినా వారి దుస్తులు ధరించినా వ్యాధి బారిన పడరన్నారు. ఎయిడ్స్ రోగులను చులకనగా చూడరాదన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఏఆర్‌టీ మందులను వైద్యుల సూచనలు, సలహాల మేరకు బాధితులు వాడితే ఆరోగ్యంగానే ఉంటారన్నారు. కోర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.సద్దాం బాలికలకు గుడ్ టచ్..బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూఎస్ దాక్షాయణి పాల్గొన్నారు.

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ

–45 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి చోరీ

శాంతిపురం: కెనమాకులపల్లి పంచాయతీలోని బడుగుమాకులపల్లిలో తాళం వేసిన ఇంటి తలుపులు పగులగొట్టి దొంగలు ఇంట్లోని నగలు, నగదు పట్టుకుపోయారు. బాధితుడు కుమార్ కథనం మేరకు వివరాలు. తమిళనాడుకు చెందిన కుమార్ కుటుంబం 30 ఏళ్ల క్రితం బడుగుమాకులపల్లికి వచ్చి నివసిస్తున్నారు. పాతవస్తువులు కొంటూ, అల్యూమినియం, స్టీల్ పాత్రలు అమ్మే వ్యాపారం చేస్తూ ముగ్గురు కుమార్తెల్లో ఇద్దరికి పెళ్లి చేశాడు. మూడో కుమార్తె పెళ్లి ప్రయత్నాలు కొలిక్కి రావడంతో 45 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండితో పాటు ఇటీవలే చీటీ పాడి రూ 2.60 లక్షల నగదును ఇంట్లో పెట్టాడు. తమిళనాడులో ఉంటున్న తన తండ్రి ఆదివారం రాత్రి మృతిచెందడంతో సోమవారం తెల్లవారుజామునే కుమార్ కుటుంబం సహా అక్కడికి వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి, బీరువాను బద్దలు కొట్టి అందులోని నగలు, నగదును దొంగలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు ఎస్ఐ ఐ నరేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ముందుగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రైతు పొలాలకు దారి కల్పిస్తాం

–జాయింట్ కలెక్టర్ విద్యాధరి


రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

గుడిపాల: రైతులు పొలాలకు వెళ్లేందుకు దారి కల్పిస్తామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి హామీ ఇచ్చారు. మంగళవారం చలిచీమలపల్లెలో రైతులకు సంబంధించి సుమారు 100 ఎకరాల పొలాలకు దారి లేకుండా చెన్నై–బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో రోడ్డు పనులు చేపట్టి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు నివేదించిన నేపథ్యంలో ఆమె ఆ ప్రాంతాలను పరిశీలించారు. ఎఫ్ఎంబీలో కూడా దారి ఉందని ఆమెకు రెవెన్యూ అధికారులు తెలియజేయడంతో ఆమె పైవిధంగా ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ఎక్స్‌ప్రెస్ హైవే సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు నైపుణ్యాలు ముఖ్యం

–జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగాలకు అభ్యర్థులు నైపుణ్యాలు కలిగి ఉండటం ముఖ్యమని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉద్యోగమేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్, డిగ్రీ చదివే విద్యార్థులు నైపుణ్యాలపై ఆసక్తి చూపించాలన్నారు. చదివే సమయంలోనే నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలన్నారు. జిల్లా ఉపాధి కల్పనా అధికారి పద్మజ మాట్లాడుతూ, విద్యార్థులు వివిధ కోర్సులలో మక్కువ చూపడమే కాకుండా వాటికి తగ్గట్టు నైపుణ్యాలు పెంపొందించుకుంటే సులువుగా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 134 మంది హాజరయ్యారని, వీరిని ఇంటర్వ్యూలు చేసి వివిధ అర్హతలు, ప్రతిభ ఆధారంగా 46 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మురళీకృష్ణ, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రూపేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి

జ్వర పీడితులను గుర్తించాలి

తవణంపల్లె: గ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించి సకాలంలో చికిత్స అందేలా చూడాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశాడే సమావేశం నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమం కింద పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. బీసీజీ వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డాక్టర్ మోహన్‌వేలు, సీహెచ్‌ఓలు సుబ్రమణ్యం, రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీహరి, రెడ్డెమ్మ, నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

సాహితీ సంపదను సంరక్షించుకుందాం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రస్తుతం సాహితీ సంపదను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, రచయిత నాగసూరి వేణుగోపాల్ అన్నారు. చిత్తూరులోని మ్యాంగో భవనంలో మంగళవారం భానుమతి నవలలపై ఆత్మీయ సాహితీ స్రవంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభామూర్తుల సాహిత్యాన్ని స్మరించుకుంటూ..వారి సాహిత్య సంపదను భావితరాలకు అందిస్తే చైతన్యవంతులవుతారని పేర్కొన్నారు. భానుమి నవల ఆనాటి సమకాలీన పరిస్థితులకు అద్దం పట్టిందని విశ్లేషించారు. అనంతరం పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో బాలక్రిష్ణారెడ్డి, గిరిధరన్, సహదేవనాయుడు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, మునస్వామి తదతరులుపాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

–జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ప్రభావతిదేవి

గుడిపాల: సీజనల్ వ్యాధులపై ఆశావర్కర్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ప్రభావతిదేవి అన్నారు. మంగళవారం బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆరోగ్యకేంద్రంలో రికార్డులను పరిశీలించారు. డాక్టర్ రష్మిత, అనూష, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభావతీదేవి

నిర్మానుష్యంగా వి.కోట


పట్టణంలో పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

- వి.కోటలో 144 సెక్షన్ అమలు
- అక్కడే కలెక్టర్, ఎస్పీ మకాం
- ఇరువర్గాలతో శాంతి కమిటీ చర్చలు

వి.కోట: సోమవారం మండలంలో క్రికెట్ బాల్‌తో రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు సోమవారం రాత్రి 2 గంటల వరకు కొనసాగాయి. ఘర్షణల్లో ఓ వర్గానికి చెందిన వ్యక్తులు మరో వర్గానికి చెందిన దుకాణాలను ధ్వంసం చేశారు. దీన్ని జీర్ణించుకోలేని మరో వర్గంలోని వ్యక్తులు, ఒక వర్గానికి చెందిన వ్యక్తికి సంబంధించిన 7 బస్సులను అర్ధరాత్రి సమయంలో ధ్వంసం చేసి, అతని ఇంటి కిటికీ అద్దాలను పగలగొట్టడంతోపాటు, బైక్‌కు నిప్పంటించారు. అంతేకాక రాత్రి 12 గంటల సమయంలో పట్టణంలో వెళుతున్న ఓ వ్యక్తి బైక్ ఆపి కొట్టి, బైక్‌ను ధ్వంసం చేశారు. విషయం తెలిసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలోపు ఆ వర్గం వారు పరారయ్యారు. సోమవారం రాత్రి కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు, పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ వి.కోటకు చేరుకుని ధర్నా చేస్తున్న వర్గంతో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. మరో వర్గం వారు పోలీసులపైకే రాళ్లు విసరడం, డీఎస్పీకి గాయాలయ్యాయి. దీంతో కలెక్టర్, ఎస్పీ వి.కోటలో మకాం వేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించారు. మంగళవారం ఉదయం జిల్లా అధికారులు ఇరువర్గాలతో చర్చించి శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. మళ్లీ గొడవలు పునరావృతంగా కాకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎస్పీ ప్రకటించారు. మరోవైపు మండలంలో 144 సెక్షన్ అమలు చేసి భారీగా పోలీసులను మోహరించారు. దీంతో పట్టణంలో నిర్మానుష్యంగా మారింది. ఏది ఏమైనా క్రికెట్ బాల్ తెచ్చిన చిన్న గొడవ ఇరు వర్గాల మధ్య గొడవలు చెలరేగడం పట్టణ ప్రజలను భయభ్రాంతులను గురిచేసింది.